సాక్షి నిజామాబాద్

బుధవారం। 20। నవంబర్। 2024



మేయర్ కుటుంబానికే..

నగర మేయర్ కుటుంబానికే రక్షణ లేనప్పుడు ప్రజలకు ఎలా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా అన్నారు.

- 10లో ▸



వినియోగదారుల రక్షణకు..

ప్రధాని మోదీ వినియోగదారుల రక్షణ చట్టంలో అనేక మార్పులు తీసుకువచ్చారని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.6 /12.4

వాతావరణం

ఉదయం చలిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచుకురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

'మధ్యాహ్న భోజన' నిధులు విడుదల

నిజామాబాద్ అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిధులు విడుదల చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. సీసీహెచ్‌ల గౌరవ వేతనం రూ.1.24 కోట్లు విడుదల చేశామన్నారు. ఈ నిధులను మండలాల వారీగా అందించనున్నారు.

క్రమబద్ధీకరణ ఉద్యోగులకు షాక్

నిజామాబాద్ అర్బన్: గత ప్రభుత్వం క్రమబద్ధీకరించిన కాంట్రాక్టు ఉద్యోగులకు వ్యతిరేకంగా హైకోర్టు తీర్పు వెలువడడంతో ఉద్యోగ వర్గాల్లో కలకలం రేగింది. గత ప్రభుత్వం జారీ చేసిన జీవో 66 ప్రకారం రాష్ట్రంలోని వివిధ శాఖలలో పనిచేసే కాంట్రాక్టు ఉద్యోగులు రెగ్యులర్ అయ్యారు. జిల్లాలో సుమారు 550 మంది కాంట్రాక్టు ఉద్యోగులు క్రమబద్ధీకరణ పొందారు. ఇంటర్మీడియట్ విద్యాశాఖలోని 211 మంది, డిగ్రీ కళాశాలలకు చెందిన 112 మంది కాంట్రాక్టు లెక్చరర్లు రెగ్యులర్ అయ్యారు. వైద్య ఆరోగ్యశాఖలోని 28 మంది, విద్యాశాఖలోని 12 మంది ఉద్యోగులు క్రమబద్ధీకరణ పొందారు. అలాగే వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు పర్మినెంట్ ఉద్యోగులుగా మారారు. హై కోర్టు తీర్పునేపథ్యంలో ప్రస్తుతం వీరందరూ తిరిగి కాంట్రాక్టు ఉద్యోగులుగా మారనున్నారు. ప్రభుత్వం ఎన్నికల ముందు కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించగా నిరుద్యోగ జేఏసీ హైకోర్టును ఆశ్రయించింది. చివరికి హైకోర్టును జేఏసీకి అనుకూలంగా తీర్పునిచ్చింది. ఇదిలా ఉండగా జిల్లా ఇంటర్మీడియట్ శాఖలో కొందరు కాంట్రాక్టు లెక్చరర్లు తప్పుడు సర్టిఫికెట్లు సమర్పించి పదోన్నతి పొందారని అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. ఇప్పటికీ రాష్ట్ర వ్యాప్తంగా విచారణ కొనసాగుతోంది.

రాజీనామాకు సిద్ధమా?

- పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్‌కు ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి సవాల్



నిజామాబాద్ అర్బన్: నీ ఇష్టం ఉన్న ఊరికి వెళ్దాం.. సెంటర్లో నిలబడదాం.. రైతుబంధు, రుణమాఫీ, బోనస్ రూ. 500 పడిందా? అని రైతులను అడుగుదాం.. అన్నీ వచ్చాయని చెబితే నేను నా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తాను. లేదంటే నీవు పీసీసీ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తావా ? అంటూ మహేశ్ కుమార్ గౌడ్‌కు ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి సవాల్ విసిరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పీసీసీ పీఠం ఎక్కగానే మహేశ్‌గౌడ్ ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై ఓ సంస్థ చేసిన సర్వేలో అనేక ఘోరాలు బయటపడ్డాయని ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం మంత్రి పదవిని త్యాగం చేసిన వ్యక్తి అన్నారు. కాంగ్రెస్ పార్టీ లో పొంగులేటి, శ్రీధర్ బాబు, భట్టి సీఎం రేస్‌లో గట్టి ప్రయత్నంలో ఉన్నారని అన్నారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఉంటాడా తెలుసుకోవాలన్నారు. నగర మేయర్ నీతూ కిరణ్ భర్తపై దాడి సరైనది కాదన్నారు. ఈ ఘటనలో కాంగ్రెస్ హస్తం ఉందని, ఈ కోణంలో పోలీసులు దర్యాప్తు చేయాలన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గణేశ్ గుప్తా, మాజీ జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు శిర్పరాజు, గూడెం రవిచంద్ర, సత్య ప్రకాష్ మౌళి, మధుసూదన్ రావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కాలభైరవుడి ఉత్సవాలు



రామారెడ్డి : ఇసన్నపల్లి(రామారెడ్డి) కాలభైరవ స్వామి ఆలయం కార్తీక బ్రహ్మోత్సవాలకు ముస్తాబయ్యింది. ఐదు రోజులపాటు స్వామివారి జన్మదిన వేడుకలు నిర్వహించనున్నారు. ఉత్సవాలు బుధవారం ఉదయం 6 గంటలకు గణపతి పూజతో ప్రారంభమవుతాయి. గురువారం బద్దిపోచమ్మ బోనాలు, శుక్రవారం లక్షదీపార్చన, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన డోలారోహణం శనివారం మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమవుతుంది. ఈ ఘట్టాన్ని తిలకించడానికి భక్తులు భారీగా తరలివస్తారు. అదేరోజు సాయంత్రం ఎడ్లబండ్ల ఊరేగింపు ఉంటుంది. ఉత్సవాల నేపథ్యంలో ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉత్సవాలకు ఉమ్మడి జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు తరలిరానున్నారు. అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో ప్రభు గుప్తా తెలిపారు.



జిల్లాలోని డిచ్‌పల్లి వద్ద 'ఇన్‌ల్యాండ్ కంటెయినర్ డిపో' ఏర్పాటుకు కంటెయినర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మూడేళ్ల క్రితమే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కంటెయినర్ డిపో ఏర్పాటయితే జిల్లాతో పాటు చుట్టు పక్కల జిల్లాలు ఆదిలాబాద్, నిర్మల్, జగిత్యాల, నాందేడ్, బీదర్, కామారెడ్డి, మెదక్‌లకు ప్రయోజనం కలుగుతుంది. ఇక్కడి వ్యవసాయ ఉత్పత్తులను దేశవిదేశాల ట్రేడర్లతో నేరుగా ఎగుమతి, దిగుమతి వ్యాపారం చేసేందుకు వీలుగా ఉంటుంది. ఇక్కడ ఎక్కువగా సాగయ్యే పసుపు, సోయా, బియ్యం, మొక్కజొన్న, కూరగాయలకు అదనపు విలువ చేకూరి రైతులకు ప్రయోజనం కలుగుతుంది.

డ్రైపోర్టు పట్టాలెక్కేనా..!

- డ్రైపోర్టు ఏర్పాటైతే ఇక్కడి నుంచి నేరుగా అంతర్జాతీయ ఎగుమతులు
- జిల్లాలో సాగయ్యే పసుపు, మొక్కజొన్న, సోయా, బియ్యం, కూరగాయల రైతులకు మేలు
- 'ఇన్‌ల్యాండ్ కంటెయినర్ డిపో' ఏర్పాటుకు సిద్ధంగా ఉన్న కంటెయినర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా
- లక్కంపల్లి సెజ్‌లో వ్యవసాయ ఆధారిత యూనిట్లకు అవకాశం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: భారతదేశ తూర్పు, పశ్చిమ తీరానికి మధ్యలో భౌగోళికంగా కీలకమైన ప్రాంతంలో ఉన్న నిజామాబాద్ జిల్లా మరోవైపు ఉత్తర భారతానికి, దక్షిణ భారతానికి గేట్‌వేలాగా ఉంది. అదేవిధంగా వ్యవసాయ ఉత్పత్తులు సమృద్ధిగా పండించే జిల్లాగా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలోనే ఉంది. ఈ నేపథ్యంలో జిల్లాలోని డిచ్‌పల్లి వద్ద 'ఇన్‌ల్యాండ్ కంటెయినర్ డిపో' (కంటెయినర్ ఫ్రైట్ స్టేషన్) ఏర్పాటు చేసేందుకు రైల్వే శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న దేశంలోనే నవరతన్ కంపెనీగా ఉన్న కంటెయినర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మూడేళ్ల క్రితమే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటాయిస్తే ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉంది.

నిజామాబాద్ చాంబర్ ఆఫ్ కామర్స్ 2015 సంవత్సరం నుంచి దీనికోసం ప్రయత్నం చేస్తోంది. ఈ క్రమంలో 2018లో నిజామాబాద్ చాంబర్ ఆఫ్ కామర్స్, తెలంగాణ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో కంటెయినర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు విన్నవించారు. దీంతో 'ఫెడరేషన్ ఆఫ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ వాళ్లు జిల్లాలో సర్వే చేశారు. తర్వాత 'ఫెడరేషన్ ఆఫ్ ఇంపోర్ట్స్ అండ్ ఎక్స్‌పోర్ట్స్ ఆర్గనైజేషన్' వారు మరోసారి రీసర్వే చేశారు. నిజామాబాద్ ప్రాంతం 'హై స్ట్రాటజికల్ అండ్ జియోగ్రాఫికల్ లొకేషన్'లో ఉందని కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖకు నివేదిక ఇచ్చారు. 'ఆజాదీ కా అమృత్' మహోత్సవాల్లో భాగంగా చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో వివిధ ఉన్నతాధికారులను కలిశారు. దీంతో కంటెయినర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జీఆర్ శేషగిరిరావు 2022 సెప్టెంబర్ 28న నిజామాబాద్‌కు వచ్చి కంటెయినర్ ఫ్రైట్ స్టేషన్ ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. ఇది ఏర్పాటు చేస్తే వెంటనే డ్రైపోర్టు సైతం కేంద్రం ఏర్పాటు చేసేందుకు మార్గం సగమం అవుతుంది.

ఉపాధి అవకాశాలు పెరుగుతాయి..



భౌగోళికంగా ఉత్తర, దక్షిణ భారతానికి గేట్‌వేగా ఉన్న నిజామాబాద్ ప్రాంతంలో కంటెయినర్ ఫ్రైట్ స్టేషన్ ఏర్పాటు చేస్తే వ్యవసాయ అనుబంధ, ఫుడ్ ప్రాసెసింగ్, అనుబంధ పరిశ్రమలు ఈ ప్రాంతానికి తరలివస్తాయి. దీంతో ఇక్కడ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. రవాణా చార్జీలు తగ్గుతాయి. కంటెయినర్ డిపో వస్తే ఈ ప్రాంతంలో రూ.300 నుంచి రూ.500 కోట్ల మేర పైగా ఎకానమీ పెరుగుతుంది. దీంతో భవిష్యత్తులో ఇక్కడ డ్రైపోర్టు వచ్చే అవకాశాలు పెరుగుతాయి. ఇక్కడి వ్యాపారులు, రైతులు అంతర్జాతీయ ఎగుమతుల విషయంలో పోటీపడే అవకాశాలు కలుగుతాయి. రోడ్డు రవాణాతో పోలిస్తే రైల్వే ద్వారా రవాణా చార్జీలు భారీగా తగ్గుతాయి. నేరుగా షిప్‌యార్డులకు ఉత్పత్తులు తీసుకెళ్లే అవకాశం ఉండడంతో మరింత చౌకగా అంతర్జాతీయంగా ఇక్కడి నుంచి ఎగుమతులు చేసుకోవచ్చు.

– నల్ల దినేష్‌రెడ్డి, నిజామాబాద్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు

భారీ పెట్టుబడులకు అవకాశం

జిల్లాలో, చుట్టు పక్కల ప్రాంతాల్లో పసుపు, సోయా, మొక్కజొన్న, ధాన్యం, కూరగాయలు భారీగా పండిస్తున్నారు. ఈ నేపథ్యంలో కంటెయినర్ ఫ్రైట్ డిపో ఏర్పాటైతే భవిష్యత్తులో డ్రైపోర్టు సైతం కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశాలున్నాయి. దీంతో లక్కంపల్లి సెజ్‌లో వ్యవసాయ అనుబంధ యూనిట్ల ఏర్పాటుకు భారీగా పెట్టుబడిదారులు వచ్చే అవకాశముంది. ఇక్కడే ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. వలసలు తగ్గుతాయి. పైగా జిల్లాలో ఇప్పటికే ఎఫ్‌పీవోల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఈ క్రమంలో రాష్ట్రప్రభుత్వం డిచ్‌పల్లి రైల్వేస్టేషన్ సమీపంలో ఇన్‌ల్యాండ్ కంటెయినర్ డిపో ఏర్పాటుకు 50 నుంచి 60 ఎకరాల భూమి కేటాయిస్తే సరిపోతుంది. రాష్ట్ర ప్రభుత్వం భూమి కేటాయింపు లేదా భూమి లీజ్‌కు ఇస్తే వెంటనే పనులు ప్రారంభిస్తామని కంటెయినర్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తెలిపారు.

పంట ఉత్పత్తులకు అదనపు విలువ..

ఈ ప్రాంతంలో ఇన్‌ల్యాండ్ కంటెయినర్ డిపో ఏర్పాటు చేస్తే నిజామాబాద్ ప్రాంతంతో పాటు చుట్టుపక్కల ఉన్న ఆదిలాబాద్, నిర్మల్, జగిత్యాల, నాందేడ్, బీదర్, కామారెడ్డి, మెదక్ ప్రాంతాలకు సౌకర్యంగా ఉండి, దేశవిదేశాల ట్రేడర్లతో నేరుగా ఎగుమతి, దిగుమతి వ్యాపారం చేసేందుకు వీలుగా ఉంటుంది. అదేవిధంగా గిడ్డంగులు కూడా ఏర్పాటవుతాయి. ఇక్కడి రైతులు పండించిన పసుపు, సోయా, బియ్యం, మొక్కజొన్న, కూరగాయలు నేరుగా ఇతర దేశాలకు పంపించవచ్చు. ప్రస్తుతం జిల్లాలో వివిధ రకాల కూరగాయలకు ధర లేని సమయంలో రోడ్లపై పారబోయాల్సిన పరిస్థితి ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో నేరుగా అంతర్జాతీయ ఎగుమతులకు అవకాశం కలిగితే ఇక్కడి వ్యాపారులతో పాటు రైతులకు మరింత మేలు కలుగుతుంది. విత్తనాల అవసరం ఎక్కువగా ఉన్న దేశాలకు నేరుగా ఎగుమతులు చేయవచ్చు. కోల్డ్ స్టోరేజ్ లాంటి ఫ్రీజర్ కంటెయినర్లు అందుబాటులో ఉన్న నేపథ్యంలో అదనపు మేలు కలుగుతుంది. ఒక్కో డిపో నుంచి 28 టన్నుల సామర్థ్యం కలిగిన 90 కంటెయినర్లు అందుబాటులో ఉంటాయి. మరోవైపు ఇతర గూడ్స్ రైళ్లకు సైతం కంటెయినర్లు యాడ్ చేసుకునే సౌలభ్యం ఉంది.

ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లో సమగ్ర సర్వే వివరాలు

- నేటి నుంచి పది రోజుల్లో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని నిర్దేశం
- రెవెన్యూ డివిజన్‌ల వారీగా ఎంపీడీవోలు, ఆపరేటర్లకు శిక్షణ



ఏర్గట్లలో సమగ్ర సర్వేను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో, ఎంపీవోలు

మోర్తాడ్(బాల్కొండ): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర సర్వే వివరాల నమోదును ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లో పొందుపరచనున్నారు. ఈ మేరకు రెవెన్యూ డివిజన్‌ల వారీగా ఎంపీడీవోలు, కంప్యూటర్ ఆపరేటర్లకు మంగళవారం శిక్షణ కార్యక్రమాన్ని అధికార యంత్రాంగం నిర్వహించింది. పది రోజుల్లో అన్ని కుటుంబాల సర్వే వివరాలను రాష్ట్ర ప్రభుత్వం రూపొందింప చేసిన ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేయాలని ఆదేశాలు అందాయి. ఇందులో భాగంగానే సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి కసరత్తు ఆరంభించారు. షెడ్యూల్ ప్రకారం సర్వే సోమవారంతోనే ముగిసిపోవాల్సి ఉంది. అన్ని కుటుంబాల వివరాల నమోదు పూర్తి కాకపోవడంతో సర్వే గడువును రెండు రోజుల పాటు పొడగించారు. జిల్లాలో 4,69,988 నివాస గృహాల వివరాలను ఎన్యుమరేటర్లు సేకరిస్తున్నారు. ఇప్పటికే 85 శాతం నుంచి 95 శాతం వరకు పూర్తి కాగా మిగిలిన సర్వే బుధవారంతో ముగిసిపోనుంది. ఇప్పటి వరకు సర్వే పూర్తి చేసిన వివరాల ఫారాలను ఎన్యుమరేటర్లు మండల కార్యాలయాల్లో అప్పగించారు. బుధవారం నుంచి 10 రోజుల పాటు ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేయాల్సి ఉండగా అందుకు అవసరమైన కంప్యూటర్‌లను సమకూర్చుకోవడం, అదనపు ఆపరేటర్లను నియమించే పనిలో అధికారులు ఉన్నారు. మండల పరిషత్, తహసీల్దార్, గ్రామ పంచాయతీలలోని ఆపరేటర్లను ఆన్‌లైన్‌లో వివరాల నమోదుకు వినియోగించనున్నారు. పది రోజులే గడువు ఉండటంతో ప్రత్యేకంగా కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న వారిని నియమించుకునే అవకాశం ఉంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్కరోజునే సమగ్ర సర్వే నిర్వహించి వారం, పది రోజుల పాటు ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేయించింది. ఇప్పుడు మాత్రం 15 రోజుల నుంచి 17 రోజుల వరకు సర్వే నిర్వహించగా పది రోజుల్లో అన్ని వివరాలను కంప్యూటర్‌లలో ఎక్కించాల్సి ఉంది. సమగ్ర సర్వే వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసిన తరువాతనే సర్వే స్వరూపం వెల్లడి అయ్యే అవకాశం ఉంది.

ఆన్‌లైన్‌లో నమోదును ఆరంభించనున్నాం..

సమగ్ర సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశాలు అందాయి. కంప్యూటర్లు ఒక చోట చేర్చి, ఆపరేటర్లను నియమించి సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించనున్నాం. ఇప్పటి వరకు అందుబాటులో ఉన్న కంప్యూటర్ ఆపరేటర్లతో ఆన్‌లైన్ నమోదు ఆరంభిస్తాం. అవసరమైతే అదనంగా ఆపరేటర్లను నియమించుకుంటాం.

– తిరుమల, ఎంపీడీవో, మోర్తాడ్

డాటా ఎంట్రీ పక్కాగా చేయాలి



శిక్షణలో పాల్గొన్న తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మండల ప్రత్యేక అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లు

- ఆర్డీవో రాజేంద్ర కుమార్



డాటా ఎంట్రీపై అవగాహన కల్పిస్తున్న ఆర్డీవో రాజేంద్ర కుమార్

డిచ్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కులగణన సర్వేలో సేకరించిన వివరాలను పకడ్బందీగా డాటా ఎంట్రీ చేయాలని నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్ అన్నారు. మంగళవారం డిచ్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో నవీపేట్, మాక్లూర్, డిచ్‌పల్లి, ధర్పల్లి, సిరికొండ, ఇందల్వాయి, మోపాల్, జక్రాన్‌పల్లి, నిజామాబాద్ రూరల్ మండలాలకు చెందిన తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మండల ప్రత్యేక అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లకు డాటా ఎంట్రీపై ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఆర్డీవో కుటుంబాల వివరాల నమోదు తీరును ప్రొజెక్టర్ సహాయంతో వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీపీవో శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

రైతులకు ధాన్యం డబ్బులు చెల్లించాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



ఒడ్డెట్‌పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

మాక్లూర్: కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన వరి ధాన్యం డబ్బులను రైతులకు సకాలంలో ఇవ్వాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. మంగళవారం మాక్లూర్ మండలం ఒడ్డెట్‌పల్లి గ్రామంలో అమ్రాద్ సొసైటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు పరిశీలించారు. ఇప్పటి వరకు సేకరించిన ధాన్యం ఏ మేరకు రైస్‌మిల్లులకు తరలించారు, బిల్లుల చెల్లింపులు ఎంత వరకు జరిగాయి వివరాలను సొసైటీ కార్యదర్శి గుండేటి గంగారాంను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం రైస్‌మిల్లులకు తరలిన అనంతరం మిల్లర్లు కడ్తా పేరిట తరుగు తీస్తున్నారా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత ఏఈవోలు ధ్రువీకరణ పత్రాలను జతపరుస్తూ ఆన్‌లైన్లో సన్న ధాన్యం వివరాలను ప్రత్యేకంగా నమోదు చేయాలని సూచించారు. సరిపడా గన్నీ బ్యాగులు ఉంచుకోవాలన్నారు. ఇప్పటికే 70 శాతం ధాన్యం సేకరణ జరిగినందున కొనుగోలు ప్రక్రియను మరింత వేగం పెంచాలని కలెక్టర్ నిర్వాహకులకు సూచించారు. వెంటవెంటనే రైతులకు రైస్‌మిల్లర్ల నుంచి డబ్బులు వచ్చేలా చూడాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే ఊరుకునేది లేదన్నారు. కలెక్టర్ వెంట డీసీవో శ్రీనివాస్, తహసీల్దార్ శేఖర్, అమ్రాద్ విండో కార్యదర్శి గంగారాం, రైతులు ఉన్నారు.

'నేడు ప్రజా పాలన - ప్రజా విజయోత్సవం'



రాజీవ్‌గాంధీ ఆడిటోరియంను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నిజామాబాద్ అర్బన్: రాష్ట్రంలో ప్రజా పాలన ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం ప్రజా పాలన – ప్రజా విజయోత్సవ సంబరాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో సాయంత్రం 6 గంటలకు కళాకారులచే అట్టహాసంగా ప్రజా కళాయాత్ర కార్యక్రమం నిర్వహించనున్నారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మంగళవారం ఆడిటోరియంను సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. అధికారులకు సూచనలు చేశారు. రాష్ట్ర స్థాయి కళాకారుల బృందం హాజరవుతోందని, ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. తెలంగాణ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అంతడుపుల నాగరాజు బృందం ప్రజా విజయోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. ఆర్డీవో రాజేంద్రకుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డీపీఆర్వో పద్మశ్రీ, తహసీల్దార్ బాలరాజు తదితరులు ఉన్నారు.

స్థల వివాదమే కారణమా!

- మేయర్ భర్త శేఖర్‌పై దాడి కేసులో నిందితుడి రిమాండ్
- మరో ముగ్గురిని విచారించిన పోలీసులు
- ఇద్దరు కాంగ్రెస్ నేతల ప్రమేయం ?



శేఖర్‌ను స్కానింగ్ కోసం తరలిస్తుండగా వెంట శ్రేయోభిలాషులు



నిందితుడు రసూల్

ఖలీల్‌వాడి: నగర మేయర్ నీతూ కిరణ్ భర్త దండు శేఖర్‌పై దాడి చేసిన కేసులో పోలీసులు నిందితుడు షేక్ రసూల్‌ను మంగళవారం రిమాండ్‌కు తరలించారు. బాధితుడు శేఖర్ నగరంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. నిందితుడు షేక్ రసూల్‌తో పాటు దాడి సమయంలో వీడియో చిత్రీకరించిన వెల్డింగ్ అహ్మద్‌ను, అదేవిధంగా శేఖర్ అనుచర వర్గానికి చెందిన గోపాల్, తిరుపతిలను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. శేఖర్ తల, చెంపకు గాయాలు కాగా స్కానింగ్ తీశారు. అంబులెన్స్ వెళ్లే సమయంలో పోలీసులు ఎస్కార్ట్ ఏర్పాటు చేశారు.

దాడి వెనుక కుట్ర..

నా భర్త దండు శేఖర్‌పై దాడి చేసిన షేక్ రసూల్ పై కఠిన చర్యలు తీసుకోవాలని నగర మేయర్ నీతూ కిరణ్ డిమాండ్ చేశారు. లేని పక్షంలో జరగబోయే పరిణామాలకు ప్రభుత్వం సిద్ధంగా ఉండాలన్నారు. దాడి వెనుక కుట్ర జరిగిందని ఆమె మీడియాతో మాట్లాడుతూ ఆరోపించారు.

కస్టడీకి తీసుకుంటాం : ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి

ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నాగారంలోని 80 క్వార్టర్స్ సమీపంలో రసూల్ కుటుంబానికి 2005లో 75 గజాల రెండు ప్లాట్లను ప్రభుత్వం ఇచ్చింది. ఒక ప్లాట్ స్థలంలో చిన్నగా ఇల్లు కట్టుకుని షేక్ రసూల్ అమ్మ, అక్కతో కలిసి నివాసం ఉంటున్నాడు. మరో ప్లాట్ గురించి మూడేళ్ల నుంచి శేఖర్ అనుచరులు గోపాల్, తిరుపతిలతో గొడవలు జరుగుతున్నాయి. రసూల్ ఏడాది క్రితం శేఖర్ ఆఫీస్‌కు వెళ్లి ప్లాట్ విషయం సెటిల్ చేయాలని కోరగా స్పందన రాలేదు. అదేవిధంగా ఇల్లు కట్టుకుంటానంటే గోపాల్, తిరుపతి బెదిరించినట్లు నాగారం పోలీస్ స్టేషన్‌లో 2021లో రసూల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు అయ్యింది. ప్లాట్ విషయం ఎటూ తేలకపోవడంతో రసూల్ మానసికంగా కుంగిపోయాడు. సోమవారం భార్యను పిల్లలతో పుట్టింటికి పంపించాడు. ఈ సందర్భంగా శేఖర్, గోపాల్‌లను చంపేస్తానని రసూల్ భార్యతో చెప్పినట్లు సమాచారం. రసూల్ మొదట గోపాల్ కోసం గాలించగా దొరకలేదు. కొద్ది సేపటికి మున్సిపల్ అధికారులతో కలిసి సీసీ రోడ్డు పనులు పరిశీలిస్తూ శేఖర్ కనిపించడంతో రసూల్ నేరుగా వెళ్లి దాడి చేశాడు. నా ఇంటి స్థలం కబ్జా చేస్తావా అంటూ ఆటోలోంచి సుత్తె తీసి కొట్టాడు. ఈ దాడిలో శేఖర్ కణత పక్కన గాయమై కిందపడిపోయాడు. స్థానికులు శేఖర్‌ను ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా నిందితుడు రసూల్‌ను కస్టడీలోకి తీసుకుని మరిన్ని కోణాల్లో విచారిస్తామని ఏసీపీ తెలిపారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సై గంగాధర్, నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, మాక్లూర్ ఎస్సై రాజశేఖర్ సిబ్బందిని ఏసీపీ అభినందించారు. మేయర్ నీతూ కిరణ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడు దాడికి ఉపయోగించిన సుత్తి, ఆటో, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. కాగా తనపై జరిగిన దాడిలో ఇద్దరు కాంగ్రెస్ నాయకుల ప్రమేయం ఉందని, వారి పేర్లను శేఖర్ పోలీసులకు తెలిపినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి(నిజామాబాద్ రూరల్): మండల కేంద్రంలోని ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌ఎస్‌ఈటీఐ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు (సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22 నుంచి సెల్‌ఫోన్ రిపేర్ (30 రోజులు), హౌస్ వైరింగ్ (30 రోజులు),సీసీ టీవీ ఇన్‌స్టాలేషన్ (13 రోజులు) కోర్సుల్లో శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయన్నారు.నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల పరిధిలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన 19 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు వారు శిక్షణ పొందేందుకు అర్హులని, ఆసక్తి గలవారు ఆధార్, రేషన్ కార్డు, ఎస్సెస్సీ మెమో, ఐదు ఫొటోలు వెంట తీసుకువచ్చి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శిక్షణ సమయంలో భోజనం, హాస్టల్ సౌకర్యం పూర్తిగా ఉచితంగా అందజేస్తారని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌తోపాటు టూల్ కిట్ అందజేస్తారని, ఇతర వివరాలకు 08461 295428 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

క్రీడాకారులను అభినందించిన జడ్జి



నిజామాబాద్‌నాగారం: తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 16, 17 తేదీల్లో గచ్చిబౌలిలో నిర్వహించిన 38వ సబ్ జూనియర్ తైక్వాండో స్టేట్ చాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జిల్లా న్యాయమూర్తి సునీత కుంచాల మంగళవారం అభినందించారు. అమెచ్యూర్ తైక్వాండో క్రీడాకారులు సహస్ర రాథోడ్ గోల్డ్ మెడల్, అవిరాజ్, అదితి, శుక్లా సిల్వర్ మెడల్ సాధించగా, సాయిప్రసన్న బ్రాంజ్ మెడల్, ఘన బ్రౌన్ మెడల్ సాధించారు. కోచ్ మనోజ్ పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంను కలిసిన గడుగు



నిజామాబాద్ సిటీ: రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం హైదరాబాద్‌లో ఇందిరా గాంధీ జయంతి నిర్వహించారు.మల్లుభట్టి ముఖ్య అతిథిగా హాజరు కాగా.. గడుగు గంగాధర్ ఆయనను సన్మానించారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి



రుద్రూర్: పొతంగల్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో మంగళవారం సందర్శించారు. కార్యాలయాల పనితీరును పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థుల ప్రగతి, హాజరు, విద్యా బోధన, పరీక్షల నిర్వహణ తదితర వివరాలపై ఆరా తీశారు. జీపీ కార్యాలయంలో విద్య, పంచాయతీ రాజ్ పనితీరుపై సమీక్షించారు. బాధ్యతాయుతంగా ఉండాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. సర్వే వివరాలను సబ్ కలెక్టర్‌కు అధికారులు వివరించారు. ఎంఈవో లోల శంకర్, పంచాయతీ అధికారి చందర్, హెచ్‌ఎం సాయిలు తదితరులు ఉన్నారు.





మల్కాపూర్(ఏ) గ్రామ శివారులోని బండ రాళ్లపై ధాన్యాన్ని ఆరబోస్తున్న రైతులు

బండరాళ్లే ధాన్యం కల్లాలు

● ధాన్యం ఆరబోసేందుకు రైతుల తిప్పలు

నిజామాబాద్ రూరల్: ధాన్యం ఆరబోసేందుకు స్థలం లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్లపై ధాన్యం ఆరబోయొద్దని అధికారులు స్పష్టం చేస్తుండడంతో స్థలం లేక అవస్థలపడుతున్నారు. మండలంలోని మల్కాపూర్(ఏ) గ్రామానికి చెందిన రైతులు పక్కనే ఉన్న గుట్ట ప్రాంతంలో పెద్దపెద్ద బండరాళ్ల(పరుపు బండ)పై ధాన్యాన్ని ఆరబోస్తున్నారు. గుట్ట ప్రాంతంలో రాత్రి వేళ ధాన్యాన్ని కాపాల ఉండే రైతులు వన్యప్రాణాలు సంచరిస్తున్నాయని భయపడుతున్నారు. కల్లాలకు సరైన స్థలం లేక ఇబ్బందులు పడుతున్నామని అధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



యూనివర్సిటీలో గ్లోబల్ ఎంటర్‌ప్రెన్యూర్ షిప్- 2024

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో మంగళవారం గ్లోబల్ ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ - 2024 వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.యాదగిరి మాట్లాడుతూ.. మేనేజ్‌మెంట్ విద్యార్థులు ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ నైపుణ్యాలను పెంపొందించుకొని ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని సూచించారు. యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్ ఆరతి మాట్లాడుతూ.. మేనేజ్‌మెంట్ విద్యార్థులు వ్యాపార రంగంలో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఏర్పాటు చేసిన వినూత్న అంశమైన 'వ్యాపార రంగంలో విజయ సాధకులతో ముఖాముఖి'లో టెంపుల్ ఆర్కిటెక్ట్, శిల్పి ధర్మేంద్రకిరణ్, ఆటోమొబైల్ రంగం సర్వీస్ నిపుణుడు ఆరుగొండ రవి, ఆహార పదార్థాల వ్యాపారవేత్త మోహన్ వ్యాపార మెళకువలను విద్యార్థులతో పంచుకొన్నారు. ఎంబీఏ విభాగాధిపతి ప్రొఫెసర్ చందుపట్ల ఆంజనేయులు ఆధ్వర్యంలో బిజినెస్ క్విజ్, బిజినెస్ ప్లాన్ పోటీలు నిర్వహించారు. న్యాయనిర్ణేతలుగా ప్రొఫెసర్ కైసర్ మహమ్మద్, ప్రొఫెసర్ అపర్ణ, డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ వాణి వ్యవహరించారు. అధ్యాపకులు కిరణ్ రాథోడ్, అలోక్‌తోపాటు ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ యాదగిరి

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు బహిష్కరిస్తాం

తెయూ(డిచ్‌పల్లి): గత రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ప్రైవేటు కాలేజ్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు హరిప్రసాద్, సంజీవరెడ్డి డిమాండ్ చేశారు. లేదంటే ఈనెల 26న ప్రారంభం కానున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షలను బహిష్కరిస్తామని అన్నారు. అలాగే ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల్లో నిరవధిక సమ్మె పాటిస్తామన్నారు. అనంతరం తెయూ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘం ప్రతినిధులు నరాల సుధాకర్, శ్రీనివాస్‌రెడ్డి, దత్తాద్రి, శ్రీనివాస్ రాజు, రాజేశ్వర్, సంతోష్, సాయి రెడ్డి, ప్రతాప్‌రెడ్డి ఉన్నారు.



రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

అ'పూర్వ' సమ్మేళనం



గురువులతో పూర్వవిద్యార్థులు

బాల్కొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1996–97 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. 27 ఏళ్ల తరువాత ఒకేవేదికపైకి చేరుకున్న స్నేహితులు ఉల్లాసంగా గడిపారు.

ఇందిరాగాంధీ సేవలు మరువలేనివి



నిజామాబాద్ సిటీ: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారని, ఆమె సేవలను జాతి మరువదని ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గాంధీభవన్‌లో మంగళవారం ఇందిరాగాంధీ 107వ జయంతిని నిర్వహించారు. ఇందిరా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కాంగ్రెస్ భవన్‌లో తాహెర్‌బిన్ మాట్లాడుతూ.. భారత దేశాన్ని ప్రపంచ దేశాల సరసన నిలిపేందుకు ఎన్నో సాహసోపేత నిర్ణయాలను ఇందిర తీసుకున్నారన్నారు. బ్యాంకుల జాతీయకరణం, గరీబీ హఠావో, హరిత విప్లవం, 20 సూత్రాల అమలు వంటి ఆమె తీసుకున్న సంచలన నిర్ణయాలని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతరెడ్డి రాజారెడ్డి, సేవాదళ్ సంతోష్, నగర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రీతం, యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ, మహిళా కాంగ్రెస్ నగర అధ్యక్షురాలు రేవతి, నగర ఎస్సీ సెల్ అధ్యక్షుడు వినయ్, డీసీసీ డెలిగేట్ ప్రమోద్, మహిళా కాంగ్రెస్ నాయకులు చంద్రకళ, ఉష, మల్లైకా బేగం, విజయలక్ష్మి, ధర్మాగౌడ్, ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ సాయిలు సంగెం, మాజీ మేయర్ సుజాత, అపర్ణ, సాయికుమార్ కుమార్, ముషపటేల్, స్వప్న, ఆకుల మహేందర్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్‌ల అప్పగింత



నవీపేట: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వ్యక్తులు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌లను రికవరీ చేసి బాధితులకు మంగళవారం అప్పగించామని ఎస్సై వినయ్ తెలిపారు. తమ మొబైల్ ఫోన్‌లు పోయినట్లు కొద్ది నెలల క్రితం 10 మంది బాధితులు ఫిర్యాదు చేశారని, ఆధునిక పరిజ్ఞానంతో సీఈఐఆర్ ద్వారా ఫోన్‌లను రికవరీ చేశామన్నారు.

వినియోగదారుల రక్షణకు ప్రత్యేక సంస్కరణలు



మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్



సుభాష్‌నగర్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వినియోగదారుల రక్షణ చట్టంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చారని, వినియోగదారుల రక్షణ కోసం పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. నగరంలోని మహేశ్వరి భవన్‌లో కొనసాగుతున్న కన్జ్యూమర్ కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) జాతీయ సదస్సులో రెండు రోజైన మంగళవారం ఎమ్మెల్యే పాల్గొని ప్రసంగించారు. సీసీఐ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచర్ల సుదర్శన్ అధ్యక్షతన నిర్వహించిన సదస్సుకు జాతీయ అధ్యక్షుడు ప్రీతి పాండ్య విశిష్ట అతిథిగా, జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మోదీ మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా లక్ష్యంతో ప్రతిఒక్కరూ ముందుకు సాగాలన్నారు. వినియోగదారుల రక్షణ కోసం స్వచ్ఛందంగా సీసీఐ రెండురోజులపాటు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

వినియోగదారులకు వెన్నుదన్నుగా సీసీఐ

వినియోగదారుల రక్షణ చట్టం పరిధిలో దేశవ్యాప్తంగా వినియోగదారులకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఏకైక సంస్థగా సీసీఐ గుర్తింపు పొందిందని జాతీయ అధ్యక్షుడు ప్రీతి పాండ్య అన్నారు. వినియోగదారుల సంక్షేమం కోసం తీసుకునే అనేక రకాల చర్యల్లో భారత ప్రభుత్వం సీసీఐని సంప్రదిస్తోందని గుర్తుచేశారు. మున్సిపల్ అదనపు కమిషనర్ ఎస్ శంకర్, జిల్లా మహిళా సంక్షేమ అధికారి ఎస్‌కే రసూల్ బీ, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ బి వాసురాం వినియోగదారుల హక్కుల ప్రాధాన్యత, ఆహారకల్తీపై అవగాహన కల్పించారు. ఇందూర్ వినియోగదారుల సంక్షేమ సమితి అధ్యక్షుడు పెందోట అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సందు ప్రవీణ్, ఉపాధ్యక్షుడు వీఎస్ వర్మ, సంయుక్త కార్యదర్శులు మహాదేవుని శ్రీనివాస్, గైని రత్నాకర్, రాజుల రామనాథం, యాటకర్ల దేవేశ్, మహిళా విభాగం అధ్యక్షురాలు లక్ష్మీప్రవళిక తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో శ్రీనివాస్

జక్రాన్‌పల్లి: మండలంలోని తొర్లికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సంకపల్లి శశికుమార్, గంగోత్రి జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల నిర్మల్‌లో నిర్వహించిన 68వ స్కూల్ గేమ్స్ రాష్ట్ర బేస్‌బాల్ అండర్–17 పోటీల్లో జిల్లా జట్టు తరపున ప్రాతినిధ్యం వహించి జిల్లా జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. దీంతో బాలుర విభాగంలో శశికుమార్, బాలికల విభాగంలో గంగోత్రి జాతీయస్థాయికి ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు డిసెంబర్ 2 నుంచి 6వ తేదీ వరకు ఢిల్లీలో నిర్వహించే స్కూల్ గేమ్స్ అండర్–17 బేస్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ మర్కంటి గంగామోహన్ తెలిపారు. క్రీడాకారులను ఎంఈవో శ్రీనివాస్ అభినందించారు. ఉపాధ్యాయులు సాయిలు, రామకృష్ణ, గంగాధర్, డాక్టర్ నరసింహరావు, సునీత, కృష్ణ, మాలతి, గౌతమి, పల్లె గంగాధర్, శేఖర్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఉషూ పోటీలకు..

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం పిప్రి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని అస్మిత జాతీయ స్థాయి ఉషూ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం విశ్వనాథ్ మంగళవారం తెలిపారు. ముప్కాల్ మండల కేంద్రంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఉషూ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన అస్మిత, వైష్ణవి, విష్ణు విజయం సాధించారని, ఉత్తమ ప్రతిభకనబర్చిన అస్మిత జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. పంజాబ్ రాష్ట్రంలో డిసెంబరు 1నుంచి నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో అస్మిత పాల్గొననున్నట్లు తెలిపారు. అస్మితను అభినందించిన వారిలో పీఈటీ ఎస్ గంగారెడ్డి, ఉపాధ్యాయులు కొటికే శ్రీనివాస్, ఆనంద్ తదితరులున్నారు.



ఉషూ పోటీల్లో ప్రతిభ కనబరిచిన పిప్రి విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి బేస్‌బాల్‌లో గోల్డ్‌మెడల్..



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నళిని, ఉపాధ్యాయులు

డిచ్‌పల్లి: మండలంలోని సుద్దపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/కళాశాల విద్యార్థులు నిర్మల్‌లో నిర్వహించిన 68వ రాష్ట్రస్థాయి బేస్‌బాల్ (అండర్ –17) స్కూల్ గేమ్స్ పోటీల్లో విజేతలుగా నిలిచి బంగారు పతకం సాధించారు. విద్యార్థినులు సాత్విక, శ్రావిక, సాన్వి, కీర్తన, వర్షిణిని ప్రిన్సిపాల్ నళిని, వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ వనిత, స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ జోష్న, పీఈటీ శ్రీలత, అకాడమీ కోచ్ మౌనిక, ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు.

హ్యాండ్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

మాక్లూర్: మండలంలోని కల్లెడి ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మంగళవారం నిర్వహించిన జూనియర్ బాలికల హ్యాండ్‌బాల్ ఎంపికలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 20 మందిని ఎంపిక చేసి శిక్షణకు పంపించారు. తెలంగాణ హ్యాండ్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్ ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లా ఎంపికలు నిర్వహించినట్లు పీడీ పింజ సురేందర్ రెడ్డి తెలిపారు. మొత్తం 80 మంది క్రీడాకారులు పాల్గొనగా ఉత్తమ ప్రతిభకనబర్చిన 20 మంది క్రీడాకారులను ఎంపిక చేశామన్నారు. త్వరలో 46వ తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని సంఘం జిల్లా అధ్యక్షుడు గంగామోహన్, పీడీ సురేందర్‌రెడ్డి తెలిపారు. సంఘం బాధ్యులు విద్యాసాగర్‌రెడ్డి, హెచ్‌ఎం ఎస్‌ఆర్ నాగరాజు, హ్యాండ్‌బాల్ సంఘం కోశాధికారి గట్టడి రాజేశ్, పీడీలు సునీత, మాధురి, రమణ, నరేంద్రచారి, అనూష, సంజీవ్, కిశోర్, సీనియర్ క్రీడాకారులు రాహుల్, సాయి పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారులు

వృద్ధుడు అదృశ్యం

భిక్కనూరు: జంగంపల్లి గ్రామానికి చెందిన కొలిమి పోచయ్య (51) అనే వ్యక్తి అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. ఈనెల 15న పోచయ్య చాయ్ తాగి వస్తానని వెళ్లి తిరిగి తిరిగిరాలేదని అతడి భార్య లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పుల బాధలో ఉన్న తన భర్త ఆచూకీ లభించడం లేదని ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తిమ్మక్‌పల్లికి చెందిన మహిళ..

కామారెడ్డి క్రైం: కామారెడ్డి మండలం తిమ్మక్‌పల్లి గ్రామానికి చెందిన రాజబోయిన డాకవ్వ అనే మహిళ అదృశ్యమైనట్లు దేవునిపల్లి ఎస్సై రాజు మంగళవారం తెలిపారు. ఈ నెల 16న ఇంటి నుంచి బయటికి వెళ్లిన డాకవ్వ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్లు వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో డాకవ్వ బంధువులు లక్ష్మీపతి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



డాకవ్వ

ఒకరిపై కేసు నమోదు

ఎల్లారెడ్డి: మండలంలోని హాజీపూర్ శివారులో రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ మంగళవారం తెలిపారు. మహ్మద్‌నగర్ మండల కేంద్రానికి చెందిన వెంకట్‌రెడ్డి ఈనెల 16న బైకుపై కామారెడ్డి నుంచి మహ్మద్‌నగర్‌కు వెళ్తుండగా హాజీపూర్ శివారులో ఎదురుగా వచ్చిన మరో బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో వెంకట్‌రెడ్డికి తీవ్రగాయాలుకాగా ఆస్పత్రిలో చికిత్స పొందా డు. బాధితుడు మంగళవారం ఫిర్యాదు చేసయగా కే సు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువకుడిపై పోక్సో ..

జక్రాన్‌పల్లి: మండలంలోని పడకల్ గ్రామానికి చెందిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను ఈ నెల 14న బలవంతంగా పెళ్లి చేసుకున్న పడకల్‌కు చెందిన యువకుడితోపాటు మరి కొంత మందిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నామన్నారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్య

నిజామాబాద్ రూరల్: రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తిర్మన్‌పల్లికి చెందిన సాయిలు (24) కుటుంబ కలహాల కారణంగా ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో మహ్మద్ ఆరిఫ్ మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గత కొన్ని రోజుల క్రితం సాయిలును ఆయన భార్య వదిలివెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన సాయిలు ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

అనారోగ్యంతో వృద్ధుడు..

భిక్కనూరు: కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కాచాపూర్ గ్రామానికి చెందిన సిద్దిపేట రాజిరెడ్డి (75) అనే వృద్ధుడు మంగళవారం ఉదయం తన వ్యవసాయ పొలం వద్ద ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించామన్నారు.

క్రైం కార్నర్

దుబాయ్‌లో మాదాపూర్ వాసి మృతి



ఖాజామియా (ఫైల్)

మాక్లూర్: బతుకుదెరువు కోసం దుబాయికి వెళ్లిన మండలంలోని మాదాపూర్‌కు చెందిన ఖాజామియా (55) అక్కడే గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు మంగళవారం తెలిపారు. దుబాయిలో పనిచేస్తుండగా ఈనెల 17న ఖాజామియాకు గుండెపోటు వచ్చినట్లు తమకు ఫోన్ ద్వారా సమాచారం అందిందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవతీసుకుని ఖాజామియా మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించాలని కోరారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

చేపలవేటకు వెళ్లి ..

మోర్తాడ్(బాల్కొండ): భీమ్‌గల్ మండలం బాబాపూర్ గ్రామానికి చెందిన మహ్మద్ ఇస్మాయిల్(33) అనే వ్యక్తి మంగళవారం గ్రామ సమీపంలోని కుంటలో చేపలు పట్టేందుకు వెళ్లి అందులో పడి మృతి చెందాడు. మృతుడి భార్య రుక్సానా బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, మూడేళ్ల కొడుకు ఉన్నారు.

పాత కక్షలతో కత్తితో దాడి



ఆస్పత్రిలో షేక్ సోహెల్

నవీపేట: పాతకక్షలతో ఓ యువకుడిపై మరో యువకుడు కత్తితోదాడి చేశాడు. ఈ ఘటన మండల కేంద్రంలో సోమవారం రాత్రి చోటు చేసుకున్నట్లు ఎస్సై వినయ్ మంగళవారం తెలిపారు. మండల కేంద్రంలోని దర్యాపూర్ కాలనీకి చెందిన షేక్ అమన్ ఆరు నెలల క్రితం డీజే సౌండ్ పెట్టి శుభకార్యాన్ని జరుపుకోగా శబ్ద కాలుష్యమవుతోందని అదే కాలనీకి చెందిన షేక్ సోహెల్ వాగ్వాదానికి దిగి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు డీజేను నిలిపివేయించారు. దీంతో కక్షపెంచుకున్న షేక్ అమన్ సోదరుడు షేక్ గౌస్ సోమవారం రాత్రి స్నేహితులతో సోహెల్‌పై కత్తితో దాడి చేసి గాయపరిచాడు. గాయపడిన సోహెల్‌ను జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. బాధితుని మామ షేక్ రజియొద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చిన్నారిపై వీధికుక్క దాడి



గాయపడిని చిన్నారి ఫైజా

బాన్సువాడ రూరల్: పట్టణంలోని మదీనా కాలనీలో మంగళవారం వీధి కుక్క స్వైరవిహారం చేసింది. కాలనీకి చెందిన ఐదేళ్ల చిన్నారి ఫైజాపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. దీంతో మాజీ వార్డు సభ్యుడు షేఖ్ అక్బర్ ఆధ్వర్యంలో స్థానికులు మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని ఆందోళన చేశారు. మున్సిపాలిటి పరిధిలో కుక్కల బెడదతీవ్రమైందని, అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

డయల్ 100ను దుర్వినియోగం చేసినఒకరికి జైలు శిక్ష

బోధన్‌టౌన్(బోధన్): డయల్ 100ను దుర్వినియోగం చేసిన వ్యక్తికి ఒక రోజు జైలు శిక్షను విధిస్తూ న్యాయమూర్తి మంగళవారం తీర్పు వెలువరించినట్లు పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు. పట్టణానికి చెందిన ఓ వ్యక్తి 100 డయల్‌కు ఫోన్ చేసి పోలీసుల సమయాన్ని వృథా చేశాడని, సదరు వ్యక్తిని కోర్టులోని సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శేష తల్పసాయి ఎదుట హాజరుపర్చగా ఒక రోజు జైలు శిక్ష విధించారన్నారు.

గోవులను తరలిస్తున్న ట్రక్కు పట్టివేత

నిజాంసాగర్(జుక్కల్): గోవులను తరలిస్తున్న ట్రక్కును మండలంలోని సుల్తాన్‌నగర్ గ్రామం వద్ద సోమవారం అర్ధరాత్రి పోలీసులు పట్టుకున్నారు. ట్రక్కులో పరిమితికి మించి 27 ఆవులను తరలిస్తుండగా పట్టుకుని గోశాలకు తరలించామని ఎస్సై సుధాకర్ తెలిపారు. బాధ్యులపై కేసు నమోదు చేశామన్నారు.

12 ట్రాక్టర్లు.. టిప్పర్..

బోధన్ రూరల్: పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు సోమవారం అర్ధరాత్రి తరువాత ప్రత్యేక తనిఖీలు నిర్వహించి అక్రమంగా ఇసుక తరలిస్తున్న 12 ట్రాక్టర్లతోపాటు ఒక టిప్పర్‌ను పట్టుకున్నట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. మంజీర నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న 12 ట్రాక్టర్లను సిద్ధాపూర్ శివారులో, టిప్పర్‌ను మందర్న శివారులో పట్టుకుని కేసు స్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేశామన్నారు.

కాన్పుకోసం వస్తే ఆభరణాలు కాజేశారు

ఖలీల్‌వాడి: కాన్పుకోసం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన మహిళ ఆభరణాలను గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం చోరీ చేశారు. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం జక్కాపూర్ గ్రామానికి చెందిన ఓ గర్భిణీ కాన్పు కోసం కాన్పు చేయించుకునేందుకు జీజీహెచ్‌కు వచ్చింది. సదరు మహిళను ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకువెళ్లే ముందు ఆమె మూడు గ్రాముల బంగారం, 10తులాల వెండిని పక్కన పెట్టి వెళ్లింది. ఆపరేషన్ తరువాత వచ్చి చూసేసరికి ఆభరణాలు కనిపించకపోవడంతో ఆమె భర్త విఠల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు.